# ప్రియంవద

## శ్రీమతి బులుసు లక్ష్మీనరసమ్మగారు

సకలకలుషాప హారిణియగు గోదావరీ పుణ్యస్రవంతినీ తీరమున రాజమహేంద్ర వరమను నొక పురంబుకలదు కదా! అప్పురవరంబున పూర్వము మృత్యుంజయుఁడను నొక బ్రాహ్మణశ్రేష్ఠుఁడుండెడివాడు. ఆతఁడు సకలకళా కోవిదుఁడును, వేదాధ్యయన తత్పరుడును. ఆతని సత్ప్రవర్తనను బురజనులు వేనోళ్లఁ బొగడుచుండెడి వారు. దైవానుగ్రహమువలన నావిప్రుఁడు సిరిసంపదలకుఁ దానకంబై యిహలోక సుఖముల ననుభవించుటయే గాక పారమార్థిక చింతతోఁ గాలక్షేపము చేయుచుండెడివాఁడు. ఆతనికి ననుకూలవతియును బరమ పతివ్రతయునునగు కామాక్షియను ధర్మపత్నితోడు నీడయైయుండెడిది.

ఇట్లుండ నా విప్రునికిఁ దీర్థయాత్రలు చేయుదమను దలంపుకలిగెను. అప్పుడు తన యిల్లాలిని ముగ్గురు పుత్రులను బిలిచి తన యావదాస్తియును నాలుగు భాగములు చేసి నలుగురికి పంచిపెట్టి తన మనోరథమును వారలతోఁ జెప్పెను. పూర్వము ధూమ శకటాది సౌకర్యములు లేకుండుటచే దూరదేశమయినను నడిచిపోవుచుండుటయే గాక తిరిగివచ్చుటకు ధైర్యములేక తమ యాస్తుల నిట్లే తమ పుత్రాదులకు నిచ్చివేయుట యాచారమై యుండెడిది.

అప్పుడు కామాక్షి "నాథా! నీతోడిద నాసుఖము. నీతో లేనిసిరిసంపదలు నాకెంత మాత్రము ననుభవింపఁదగినవి కావు. అర్ధాంగినగు నేను సుఖముగాని దుఃఖముగాని నీతో సమానముగా ననుభవించియే తీరవలయును. "పతిగలుగుకంటె సౌఖ్యము సతులకు నొండొండుకలదె చర్చింపంగాఁ పతిలేమి సర్వశూన్యము పతిగలిగిన సతికి నింద్రపదవి యదేలా?" అని పెద్దలు చెప్పెదరుకదా? నీతో తీర్థయాత్ర లనుభవింపలేని యీతుచ్ఛ శరీరమును గోదావరి కర్పించెదను." అని చెప్పుధర్మపత్ని వాక్యములు విని యనిష్ట మయ్యును నాసన్నప్రసవవేదనయగు తన భార్యను దోడ్కొని కాశీక్షేత్రమునకు

ప్రయాణము సాగించెను. ఇట్లు సని చని కతిపయ ప్రయాణంబులకు నొక మహారణ్యమును జేరుకొనిరి. అచ్చట కామాక్షికిఁ బ్రసవవేదన కలిగి యొక సుపుత్రుఁడు రాజలక్షణములతో బుట్టెను. అప్పుడు మృత్యుంజయుఁడు శాస్త్రదృష్టితో నాబాలుని బరికించి భార్యతో నిట్లు వక్కాణించెను. "ప్రేయసీ! యీబాలకుఁడు మన యొద్దనున్నచో ప్రమాదము వాటిల్లును. ఇచ్చటనేయుంచి పోయినచో గొప్పచక్రవర్తి కాగలఁడ"నిచెప్పి కామాక్షిని సమాధానపరచెను. "యోమే గర్భగతస్యాపివృత్తిం కల్పితవాన్ ప్రభుః।" అనునర్ధ శ్లోక మొకతాటాకుపై వ్రాసి యాయర్భకుని కంఠమునఁగట్టి పల్లవశయనము కల్పించి యాబాలుని దానిపై బరుండఁబెట్టి యెట్టకేలకు నాదంపతులు పయనము సాగించి కాశిసిఁ జేరుకొనిరి. అట్లు కాశ్యాది దివ్యక్షేత్రములు తీర్థములు క్రమమున సేవించుచుండిరి.

౨

ఇచ్చట నాయర్భకుని నొక మహాసర్పము చుట్టుకొని తన ఫణములచే నాబాలకునకు నెట్టి బాధ కలుగకుండ కాపాడుచుండెను. ఆశిశువు వట వృక్షముక్రింద పరుండుటచే నాచెట్టుపైనున్న తేనెపట్టునుండి మధుబిందువు లాబాలకుని నోటపడుచుండెను. అట్లు మధుబిందువులు గ్రోలుచు ఫణీంద్ర వేష్టుఁడయి నిర్భయముగాను సుఖముగాను శుక్లపక్ష చంద్రునిరీతి నా బాలకుఁడు వృద్ధినొందుచుండెను. దిక్కులేని వానికి దేవుడేదిక్కుకదా? ఇట్లుకొంతకాలము చనిన పిదప నాప్రాంత దేశములను పాలించుచున్న ప్రభావసుఁడను నొక రాజన్యుడు మృగయార్థియై నాప్రాంతమునకువచ్చి ఫణీంద్ర వేష్టుఁడై ముద్దులుమూంగారుచున్న నాబాలకునిచూచెను. అంతలో నాపాము నెందేని చనియెను. రాజు అప్పుడా బాలకుని శిరము మూర్కొని తన రథముపై నిడికొని నిజనివాసమునకు జనియెను. వానికంఠమున తాటాకుపైనున్న యర్థశ్లోకము పరికించి యర్థము గ్రహించెను. వెంటనే కొందఱు సేవకులను బిలిచి యామహారణ్యమున నొక సత్రము కట్టించుఁడని యాజ్ఞాపించెను. అట్లేవారుచేసిరి. అప్పుడు రాజాసత్రమున నాయర్థశ్లోకము నొకబల్లపై వ్రాయించి యాసత్రద్వారమున కట్టించెను. మఱియు నచ్చటనుండు సేవకులతో "నీఅర్థశ్లోకముపూర్తి చేయువానిని నాయొద్దకు దీసికొని రమ్మని యాజ్ఞాపించెను.

ఇట్లుండ నొకనాఁడు నామృత్యుంజయుఁడు తీర్థయాత్రను సేవించి యాయరణ్యమార్గమున భార్యతోవచ్చుచు సత్రమును దిలకించెను. క్రొత్తగాఁ గల్పించిన యాసత్రమునుగాంచి యాశ్చర్యము నొంది యా యర్థశ్లోకము పూర్తిచేయునంతలో నాబ్రాహ్మణుని

చారులు రాజునొద్దకుఁ గొంపోయిరి. వీరలు మహాభయముతో రాజునొద్దకు వెళ్లఁగా వారి వృత్తాంతమును నామూలాగ్రముగా దెలిసికొని రాజు వారిపుత్రుని వారలకు నర్పించి ధనధాన్యముల నొసఁగి పొమ్మనెను. అప్పుడా బ్రాహ్మణుఁడు రాజును జూచి "మహాత్మా! దైవానుగ్రహమువలన నాకన్నవస్త్రములకు లోటులేదు. మఱియు ముగ్గురుపుత్రులు కూడ నింటఁగలరు. అందుచే నీవు సంతానహీనుడవు కనుక నీవీపుత్రుని పెంచుకొనుమని యిచ్చివేసెను. అప్పుడు రాజు మహాప్రసాదమని పరిగ్రహించి యా బ్రాహ్మణుని గౌరవించి పంపెను. అప్పుడు రాజు నాబాలునకు వరరుచియని పేరిడి గారాబముతో పెంచుచుండెను.

## 3

ఇట్లు కొంతకాలము చనఁగా వృద్ధుడగు ప్రభావసుఁడు ప్రాప్తయౌవనుఁడగు వరరుచికి రాజ్యము నప్పగించి తపస్సుకై పోయెను. అప్పుడు వరరుచి జనానురంజకుఁడై రాజ్యము పాలింపుచుండెను. ఇట్లుండ నొకనాడు వరరుచికి వివాహమాడు తలంపుగలిగి "నీయభిమాన మెవ్వరిది నిక్కముగా లిఖియించుకోమలీ!" అని యొక్క పద్యపాదమును లేఖపై వ్రాసి కొందరు సేవకులనుబిలిచి "దీనిని సమస్తదేశములలోఁ గల రాజకన్యలకుఁ జూపుఁడు. ఆయారాజకన్యలు వ్రాయు జవాబులను నచిరకాలమున నాయొద్దకు తీసికొని రం"డనియాజ్ఞాపించెను. అట్లువారు పత్రికను నాయారాజకుమారికలకు జూపిరికాని తగిన సమాధాన మెవ్వ రివ్వజాలరైరి. కాని చోళదేశపు రాజపుత్రిక మాత్రము "నాయభిమానంబు నాదె నయగుణదీపా!" అని ప్రత్యుత్తరమిచ్చెను.

ఆప్రత్యుత్తరము తీసికొనివచ్చి రాజునకుఁజూపిరి. అప్పుడురాజుసంతసించి సపరివారముగామహావైభవముతో చోళదేశమునకుఁబోయెను. చోళరాజువానిని గౌరవించి వరరుచి మనోరథము తెలిసికొని సంతోషపూర్వకముగా చోళరాజు ప్రియంవదయను దన పుత్రికారత్నమును వరరుచికిచ్చి విధ్యుక్తముగా వివాహము చేయించెను. వరరుచి వివాహోపంతరము తనపరివారమును అనేకములగు ధనాలనొసంగి తనదేశము పంపించెను. తాను మాత్రము కొంతకాలమచ్చటనేయుండి యొకనాడు భార్యయగు ప్రియంవదతోఁ గలసి తనదేశమునకు పయనమయ్యెను. అప్పుడు త్రోవలో నొకనదిని దాటవలసివచ్చెను. అప్పుడా మహాస్రవంతిని ప్రవాహపరంపరలతో రెండుగట్లులను నొరసిపాఱుచుండెను. అట్టి నదిని దాటుటకై యొకనావలో నిరువురు కూర్చుని నదినిదాటుచుండ నంతలో దురదృష్టవశమున నా పడవ రెండు వ్రక్కలయ్యెను. అప్పుడు ప్రియంవదా వరరుచులు నాప్రవాహములో కొట్టుకొనిపోయిరి.